ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్మార్ట్ ఎడిషన్ Evening 6PM
సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 54 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు : 3 +https:www.prajarepublic.com + వెల - 1/-
శనివారం 28 సెప్టెంబర్ 2024
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole



## జవాన్‌ల త్యాగం కాంగ్రెస్‌కు తెలియదు..

## మోదీ ఫైర్

ఎన్నికల నేపథ్యంలో జమ్మూలో ఏర్పాటుచేసిన ప్రచార ర్యాలీలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రతిపక్షాలపై ఆయన నిప్పులు చెరిగారు.



శ్రీనగర్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 28: జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు కొనసాగుతున్నాయి. ఈనేపథ్యంలోనే జమ్మూలో భాజపా ఏర్పాటుచేసిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. భారీగా హాజరైన ప్రజలనుద్దేశించి మోదీ ప్రసంగించారు. ఈసందర్భంగా ఆయన ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్, ఎన్సీపీ, పీడీపీ ఈ మూడు కుటుంబ పార్టీలతో జమ్మూకశ్మీర్ ప్రజలు విసిగిపోయారని ప్రధాని విమర్శించారు. అవినీతి, ఉద్యోగాల్లో వివక్షను ఈ ప్రాంత ప్రజలు కోరుకోవడం లేదన్నారు. ఉగ్రవాదం, వేర్పాటువాదం, రక్తపాతానికి దూరంగా ఉండాలని వారు ఆకాంక్షిస్తున్నారని ప్రధాని పేర్కొన్నారు. దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన జవాన్ల విలువ కాంగ్రెస్కు తెలియదంటూ ఆ పార్టీపై తీవ్ర ఆరోపణలు చేశారు. "కాంగ్రెస్ హయాంలో సరిహద్దుల్లో కాల్పులు జరిగినప్పుడల్లా ఆ పార్టీ తెల్ల జెండాలను ఎగురవేసింది. కానీ, భాజపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. భారత్ ఉగ్రవాదులపై ఎదురుకాల్పులకు దిగింది. 2016 సెప్టెంబరు 28 రాత్రి సర్జికల్ స్ట్రైక్ జరిగింది. శత్రువుల భూభాగంలోకి వెళ్లి దాడి చేయగలిగిన నవ భారత్ను నాడు ప్రపంచమంతా చూసింది. దేశ రక్షణ కోసం జవాన్లు చేసిన త్యాగం విలువ ఆ పార్టీకి తెలియదు. వారిని ఎన్నడూ గౌరవించలేదు. నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ సైనికులకు మాయమాటలు చెప్పింది. 'వన్ ర్యాంక్, వన్ పెన్షన్' ఇస్తామంటూ వారిని ఎదురుచూసేలా చేసింది" అని తీవ్ర ఆరోపణలు చేశారు.

### పూర్తి మెజారిటీతో అధికారంలోకి..

జమ్మూకశ్మీర్ లోని ఏడు జిల్లాల పరిధిలో తొలిదశ కింద 24 శాసనసభ నియోజకవర్గాలకు ఇటీవల జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 61 శాతం పోలింగ్ నమోదవడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ప్రజలకు అభినందనలు తెలియజేశారు. ఈ ఎన్నికల్లో భాజపా విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తంచేశారు. "ఈ విజయదశమి మనందరికీ ఎంతో ప్రత్యేకం. జమ్మూకశ్మీర్లో తొలిసారిగా భాజపా ప్రభుత్వం ఏర్పాటు అవుతుంది. పూర్తి మెజారిటీ అధికారంలోకి వస్తుంది" అని విశ్వాసం వ్యక్తంచేశారు.

## టాటా మొబైల్ తయారీ కేంద్రంలో పేలుడు..

## భారీగా ఎగిసిపడిన మంటలు

తమిళనాడులోని టాటా ఎలక్ట్రానిక్స్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం చోటు చేసుకోవడంతో భారీగా మంటలు చెలరేగాయి.

కోయంబత్తూరు, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 28: తమిళనాడులోని టాటా ఎలక్ట్రానిక్స్ ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఫ్యాక్టరీలోని రసా-యన గోదాములో పేలుడు సంభవించడంతో ఈ ఘటన జరిగింది. పెద్దఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణగిరి జిల్లా ఉద్దానపల్లిలోని టాటా ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ (టీఈపీఎల్)లో గల మొబైల్ ఫోన్ యాక్సెసరీస్ పెయింటింగ్ యూనిట్లోని ర-సాయన గోదాములో శనివారం ఉదయం 5.30 గంటలకు ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన సిబ్బంది గోదాములో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ సురక్షితంగా బయటకు తరలించారు. ప్రమాదం ధాటికి భారీగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకొని ఏడు ఫైర్ ఇంజిన్ల సాయంతో మంటలు అదుపులోకి తెచ్చారు. ఈ కంపెనీలో టిఈపిఎల్ సంస్థ ఐఫోన్లలో వాడే వివిధ ఉపకరణాలను ఉత్పత్తి చేస్తోంది. సుమారు 4,500 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో రాత్రిపూట విధుల్లో ఉన్న ఉద్యోగులు మాత్రమే ఉన్నారు. వారు వెంటనే అప్రమత్తమవడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని పోలీసులు పేర్కొన్నారు. పెద్దఎత్తున మంటలు చెలరేగడంతో కొందరు ఉద్యోగులు శ్వాస సంబంధిత ఇబ్బందులను ఎదుర్కొన్నారని, వారిని ఆసుపత్రికి తరలించారని తెలిపారు. ప్రభావిత ప్రాంతంలో 100 మందికి పైగా పోలీసు సిబ్బందిని మోహరించినట్లుగా ఎస్పీ తంగదురై వెల్లడించారు.



## సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ విద్యావేత్తల బహిరంగ లేఖ

సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ విద్యావేత్తలు బహిరంగ లేఖ పంపారు.

హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 28: సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ విద్యావేత్తలు బహిరంగ లేఖ పంపారు. లేఖ రాసిన వారిలో ఎమ్మెల్సీ కోదండరామ్, హరగోపాల్, ఘంటా చక్రపాణి, దొంతి నరసింహారెడ్డి ఉన్నారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీకి చెందిన భూమిని జవహర్ లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నామమాత్రం ఫీజుతో విద్య అందిస్తున్న ఏకైక వర్సిటీ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అని చెప్పారు. దీన్ని నిలబెట్టుకోవాల్సిన అవసరం అందరిపై ఉందని పేర్కొన్నారు.



## పూటకో మాట జగన్‌కు అలవాటు: హోంమంత్రి అనిత

పూటకో మాట జగన్కు బాగా అలవాటుగా మారిందని ఏపీ హోంమంత్రి అనిత విమర్శించారు.



మంగళగిరి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 28: పూటకో మాట జగన్కు బాగా అలవాటుగా మారిందని ఏపీ హోంమంత్రి అనిత విమర్శించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. "జగన్ ఆఖరి నిమిషంలో తిరుమల పర్యటన ఆపేసుకున్నారు. నోటీసులు ఇచ్చారంటూ అబద్ధాలు చెబుతున్నారు. అసత్యాలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారు. ఒక్క నాయకుడినైనా గృహనిర్బంధం చేశారా? ఆయన్ను రావద్దని ఎవరూ నోటీసు ఇవ్వలేదే? తిరుమల వెళ్లేందుకు జగన్కు ఇష్టం లేదు. డిక్లరేషన్ ఇచ్చే ఉద్దేశం లేకనే పర్యటన ఆపేసుకున్నారు. ప్రసాదం ఇస్తే పక్కన పెట్టేవాళ్లు రుచి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉంది. లడ్డూ రుచిపై మాట్లాడిన జగన్.. ఏరోజైనా తిరుమల లడ్డూ తిన్నారా? ఆయనకు ప్రసాదం ఇస్తే టిష్యూ పేపర్ లో చుట్టి పక్కన పెట్టేస్తారు. అక్షింతలు వేస్తే దులుపేసుకున్న సందర్భాలు ఎన్నో చూడలేదా? డిక్లరేషన్ ఇవ్వమంటే దళితుల అంశాన్ని ముడిపెడుతున్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. మానవత్వంపై ఆయన మాట్లాడుతుంటే.. ఆ పదమే సిగ్గుపడుతుంది. శుక్రవారం జగన్ పర్యటన సందర్భంగా ఒక్కరినైనా బైండోవర్ చేశామా? సెక్షన్ 30 యాక్ట్ చేస్తే తనకే అది జారీ చేసినట్లు కథలు అల్లారు" అని అనిత తెలిపారు.

## గనుల శాఖలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించండి :కేటీఆర్

గనుల శాఖలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు.



హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 28: నకిలీ పత్రాలు, రసీదులు సృష్టించి ఖనిజాభివృద్ధి సంస్థ నుంచి రూ.150 కోట్ల విలువైన ఇసుకను దోచుకున్న ఇంటిదొంగలపై దర్యాప్తు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశా-ారు. ఎక్స్ వేదికగా స్పందించిన ఆయన... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గనుల శాఖలో అవినీతి ఘనులని పేర్కొన్నారు. నకిలీ పత్రాలు, రసీదులతో రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ నుంచి రూ.150 కోట్లు విలువచేసే 1.5 లక్షల టన్నుల ఇసుక దోచేశారని ఆరోపించారు. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అవసరాల కోసమంటూ తప్పుడు కాగితాలు సృష్టించి ఇసుకను దారి మళ్లించారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వద్ద ఉన్న శాఖలోనే జరిగిన ఈ కుంభకోణం, ప్రభుత్వ పెద్దలకు తెలియకుండా ఉండదని వ్యాఖ్యానించారు. వెంటనే ఈ ఇసుక దొంగలెవరో దర్యాప్తు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## యువత.. జాషువా స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలి :మంత్రి దుర్గేశ్

విశ్వనరుడు, కవి గుర్రం జాషువా చూపించిన మార్గంలో నడవాలని, ఆయన స్ఫూర్తిని యువత అందిపుచ్చుకోవాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ సూచించారు.



విజయవాడ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 28: విశ్వనరుడు, కవి గుర్రం జాషువా చూపించిన మార్గంలో నడవాలని, ఆయన స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ ఈతరం యువతకు సూచించారు. విజయవాడ కలెక్టరేట్లో గుర్రం జాషువా 129వ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి కందుల దుర్గేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జాషువా స్మారక అవార్డులను రచయితలు శిఖామణి, ఎజ్రా శాస్త్రి, వరప్రసాద్, గాయకుడు రమణయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ఆనాటి సామాజిక రుగ్మతలను జాషువా తన రచనల ద్వారా సమసమాజ ఆవశ్యకతను చాటారని చెపా-ారు. అంటరానితనాన్ని మనోవైకల్యంగా భావించాలని.. రాష్ట్రంలో కళా, సాంస్కృతిక వైభవాన్ని పునరుజ్జీవనం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మనదైన కళా, సాంస్కృతిక వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్తామన్నారు. తెలంగాణలో మాదిరిగా మన రాష్ట్రంలోనూ మహనీయుల వేడుకలను ఘనంగా నిర్వహించేలా సాంస్కృతిక కార్యాచరణను చేపడతామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన పలువురు రచయితలు, కవులు తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర సాధనకు సూచనలు పంపండి: సీఎం చంద్రబాబు

స్వర్ణాంధ్ర సాధనకు ప్రజల నుంచి సూచనలు ఆహ్వానిస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు.



అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 28: స్వర్ణాంధ్ర సాధనకు ప్రజల నుంచి సూచనలు ఆహ్వానిస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ఈమేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. ప్రజలు తమ అభిప్రా-యాలు, సూచనలను swarnandhra. ap. gov. in/Sugges-tions పంపవచ్చన్నారు. ఇలా చేసిన అనంతరం అభినందనలను ఇ-సర్టిఫికెట్ ద్వారా అందుకోవచ్చని చెప్పారు. 2047 నాటికి మెరుగైన వృద్ధిరేటు సాధనే లక్ష్యమని తెలిపారు. స్వర్ణాంధ్రప్రదేశ్ ఏ2047 వైపు ప్రయాణాన్ని ప్రారంభించామని చెప్పారు. ఏపీ భవిష్యత్తు రూపకల్పనకు పౌరులు సూచనలు ఆహ్వానిస్తున్నట్లు చంద్రబాబు పేర్కొన్నారు. ప్రతి సూచనను పరిగణనలోకి తీసుకుంటూ సమష్టిగా స్వర్ణాంధ్రను నిర్మించుకుందామన్నారు.

## లడ్డూలో కల్తీ నెయ్యి పాపం జగన్దే :మంత్రి సత్యకుమార్

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగించిన పాపం వైకాపా అధినేత జగన్దే అని.. ఆయన ప్రజలకు క్షమాపణ చెప్పాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ డిమాండ్ చేశారు.



ధర్మవరం, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 28: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగించిన పాపం వైకాపా అధినేత జగన్దే అని.. ఆయన ప్రజలకు క్షమాపణ చెప్పాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తన బంధువులైన వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డిలను తితిదే ఛైర్మన్లుగా, తనకు అనుకూలమైన అధికారి ధర్మారెడ్డిని ఈవోగా నియమించారని చెప్పారు. శ్రీవారి లడ్డూ ప్రసాదంలో వినియోగించిన నెయ్యి విషయంలో జగన్ అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా వెంకటేశ్వర స్వామి భక్తులు ఆందోళనకు గురయ్యారన్నారు. నాలుగు గోడల మధ్య బైబిల్ చదువుతానని, బయట ఇతర మతాలను గౌరవిస్తానని చెప్పిన జగన్.. డిక్లరేషన్లో సంతకం చేసే ధైర్యం లేక తిర-ుమలకు వెళ్లలేదని ఎద్దేవా చేశారు.

## ముగిసిన జానీ మాస్టర్ పోలీసు కస్టడీ

అత్యాచార ఆరోపణలు, పోక్సో కేసులో అరెస్టయిన కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ పోలీసు కస్టడీ ముగిసింది.

హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 28: అత్యాచార ఆరోపణలు, పోక్సో కేసులో అరెస్టయిన కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ పోలీసు కస్టడీ ముగిసింది. ఈ కేసులో నాలుగు రోజులపాటు అతడిని నార్సింగి పోలీసులు విచారించారు. అనంతరం పోలీసు స్టేషన్ నుంచి ఉప్పరపల్లి కోర్టుకు తరలించారు. కోర్టులో హాజరుపరిచిన అనంతరం చంచల్గూడ జైలుకు అతడిని తరలించనున్నారు. తనపై అత్యాచారానికి పాల్పడ్డారంటూ ఓ అసిస్టెంట్ మహిళా కొరియోగ్రాఫర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు జానీ మాస్టర్ను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.






printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

## ఏఐ సాయంతో బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ప్రపంచ వ్యాప్తంగా ప్రస్తుతం సాంకేతికంగా ఎన్నో మార్పులు వస్తున్నాయని, న్యాయ వ్యవస్థ కూడా కృత్రిమ మేథను మరింత ఉపయోగించుకొని బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము అన్నారు.




హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 28: ప్రపంచ వ్యాప్తంగా ప్రస్తుతం సాంకేతికంగా ఎన్నో మార్పులు వస్తున్నాయని, న్యాయ వ్యవస్థ కూడా కృత్రిమమేథను మరింత ఉపయోగించుకొని బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము అన్నారు. ధనికులతో పోలిస్తే పేదలు న్యాయం పొందలేకపోతున్నారని.. మెరుగైన సమాజం కోసం ఈ విధానంలో మార్పు రావాలని రాష్ట్రపతి అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ న్యాయబద్ధంగా సత్యాగ్రహ దీక్ష చేసి ఆదర్శంగా నిలిచారని ముర్ము అన్నారు. నిబద్ధత, పారదర్శకంగా పనిచేస్తే న్యాయవాద వృత్తిలో ఎంతో ఎత్తుకు ఎదగొచ్చని తెలిపారు. నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 21వ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పీహెచ్‌డి, ఎల్ఎల్ఎంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రాష్ట్రపతి చేతుల మీదుగా బంగారు పతకాలు అందించారు. అంతకు ముందు బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి.. గవర్నర్ జిష్ణుదేవవర్మ, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, సీఎస్ శాంతి కుమారి, డీజీపీ జితేందర్ స్వాగతం పలికారు.



## 'నాకే అవమానం జరిగింది': ఎస్సీ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ ఆవేదన

మెదక్ జిల్లా అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య అసహనం వ్యక్తం చేశారు.




మెదక్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 28: భూములు, అట్రాసిటీ కేసులపై మెదక్ సమీకృత కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ జిల్లాలో అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల మెదక్ కలెక్టరేట్లో ఇన్చార్జి మంత్రి కొండా సురేఖ, మంత్రి దామోదర్ రాజ నరసింహ జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంపై తనకు ఎలాంటి సమాచారం లేదన్నారు. సమీక్ష సమావేశంలో ఫ్లెక్సీలో కనీసం ఫొటో, స్టేజ్ పైన నేమ్ బోర్డు కూడా పెట్టలేదన్నారు. 'నాకే అవమానం జరిగింది. ఎస్సీ, ఎస్టీలకు అవమానం జరగదా? అని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ అయ్యాక జీఏడీకి ఉమ్మడి మెదక్ జిల్లా ప్రోటోకాల్ ఇచ్చినట్లు గుర్తు చేశారు. సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాలో జరిగే ప్రతి అధికారిక కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నారని చెప్పారు. మెదక్ జిల్లా కలెక్టర్, అధికారులు మాత్రం ప్రోటోకాల్ పాటించడం లేదని, అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించడం లేదని చెప్పారు. తనకు జరిగిన అగౌరవంపై తీవ్ర మనస్తాపానికి గురయ్యానన్నారు. ఇలాంటివి మళ్లీ జరగకుండా చూసుకోవాలని, మరోసారి ఇలా జరిగితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

## గుర్తుతెలియని వ్యక్తి దారుణ హత్య

దేవరకొండ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 28: నల్గొండ జిల్లా దేవరకొండ మండలం చేరుకుపల్లి ఊరు శివారులో ఒక గుర్తు తెలియని మగ మనిషి మృతదేహం ఉందని సమాచారం రాగా వెంటనే పోలీసులు అక్కడికి వెళ్ళి మృతదేహం ను పరిశీలించారు. మృతుడు వయసు సుమారు 35-38 సం'ల మధ్య ఉండి అతని కాళ్ళు చేతులు తాళ్ల తో కట్టబడి ఒక తెలుపు చూన్ని తో కళ్ళు మాయబడి, బండరాయి తో తల మీద కొట్టి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు అతన్ని చంపి ఇక్కడ వదిలి వెళ్ళినట్టుగా తెలుస్తుంది. మృతదేహం వంటి మీద బలమైన రక్తగాయలు ఉండి అలాగే బులుగు రంగు బనియన్. నెక్కరు వేసుకొని మృతదేహం తెలుపు రంగులో ఉండి ఏత్తు అందజగ 5'6" నుండి 5'8" వరకు ఉంటుంది. గుర్తు తెలియని మృతదేహం యొక్క సమాచారం తెలిసిన యెడల పోలీసులకు సమాచారం వేయాలని కోరారు.



### గుర్తు తెలియని మహిళను హతమార్చి.. ప్లాస్టిక్ కవర్లో చుట్టి

హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 28: రంగారెడ్డి జిల్లా షాద్నగర్ కోర్టు సమీపంలోని ఇళ్ల మధ్య గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని కాలనీవాసులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. షాద్నగర్ ఏసీపీ రంగస్వామి, సీఐ విజయ్‌కుమార్, ఎస్సై శరత్ ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. వారితోపాటు అక్కడికి చేరుకున్న క్లూస్ టీం ఆధారాలను సేకరిస్తోంది. సుమారు 35 నుంచి 45 ఏళ్ల వయసు ఉన్న గుర్తు తెలియని మహిళను కొందరు దుండగులు ఎక్కడో హత్య చేసి షాద్నగర్ పట్టణంలోని శ్రీనివాస కాలనీలోని ఇళ్ల మధ్య పడేసినట్లు ఏసీపీ తెలిపారు. ప్లాస్టిక్ కవర్లో మృతదేహాన్ని చుట్టి ఉంచారని చెప్పారు. పసుపు రంగు దుస్తులు ఉన్నాయని, ఆమె రెండు చెవులు కత్తిరించి చెవి కమ్మలు తీసివేసిన ఆనవాళ్లు ఉన్నట్లు వెల్లడించారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత పూర్తి వివరాలు తెలుస్తాయని తెలిపారు. షాద్ నగర్ ఇన్స్పెక్టర్ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## వైకాపా పాలనలో జరిగిన గనుల దోపిడీపై విచారణ జరపాలి :వైఎస్ షర్మిల

వైకాపా ప్రభుత్వ పాలనలో జరిగిన గనుల దోపిడీపై విచారణ జరపాలని వైఎస్ షర్మిల కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



విజయవాడ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 28: వైకాపా ప్రభుత్వ పాలనలో జరిగిన గనుల దోపిడీపై గనుల శాఖ మాజీ డైరెక్టర్ వెంకట్ రెడ్డి లాంటి తీగలే కాదు, పెద్ద డొంకలు కూడా కదలాలని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ఆ పెద్ద డొంక ఏ ప్యాలెస్లో ఉన్నా.. విచారణ జరపాలని ఆమె డిమాండ్ చేశారు. రూ.2,566 కోట్ల దోపిడీకి పాల్పడిన ఘనుడు వెంకట్ రెడ్డి అయితే.. తెరవెనుక ఉండి, సర్వం తానై, రూ.వేల కోట్లు కాజేసిన ఆ ఘనాపాటి ఎవరో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని విమర్శించారు. ఐదేళ్లుగా రాష్ట్రంలో అడ్డగోలుగా సహజ సంపదను దోచుకుని తిన్నారని ఆరోపించారు. అస్మదీయ కంపెనీలకు మైనింగ్ కాంట్రాక్టులు ఇచ్చారని, టెండర్లు, ఒప్పందాలు, నిబంధనలన్నీ బేఖాతరు చేసి.. అనుకున్న కంపెనీకి టెండర్లు కట్టబెట్టారని ఆరోపించారు. ఎన్జీటీ నిబంధనలను తుంగలో తొక్కారని షర్మిల విమర్శించారు. రాష్ట్ర ఖజానాకు రావాల్సిన నిధులు సొంత ఖజానాకు తరలించారన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన మైనింగ్ కుంభకోణం పై ఏసీబీ విచారణతో పాటు.. పూర్తి స్థాయిలో సమగ్ర దర్యాప్తు జరపాల్సిన అవసరం ఉందన్నారు. చిన్న చేపలను ఆడించి సొమ్ము చేసుకున్న పెద్ద తిమింగలాన్ని పెట్టుకొనేలా దర్యాప్తు జరగాలని కూటమి సర్కార్ను డిమాండ్ చేస్తున్నామన్నారు. సహజ వనరుల దోపిడీపై సీబీఐ విచారణ జరగాలన్నారు.

## ఇక్కడి సంప్రదాయాలను కించపరుస్తూ.. జగన్ దేశంలో ఎందుకుండాలి? :మంత్రి గొట్టిపాటి రవి

వైకాపా అధ్యక్షుడు జగనన్ను వెంటనే దేశ బహిష్కరణ చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ డిమాండ్ చేశారు.



అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 28: వైకాపా అధ్యక్షుడు జగన్ను వెంటనే దేశ బహిష్కరణ చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ డిమాండ్ చేశారు. దేశ సంప్రదాయాలు పాటించకపోగా కించపరిచినందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి దేశంలో బతుకుతున్నామో అన్న వ్యాఖ్యలను జగన్ ఉపసంహరించుకోవాలని చెప్పారు. మత సిద్ధాంతాలను గౌరవిస్తేనే మంచి పౌరుడు అవుతారని పేర్కొన్నారు. రాజకీయ లబ్ధికి మత విశ్వాసాలు, సంప్రదాయాలను కించపరచడం బాధాకరమన్నారు. డిక్లరేషన్ ఇవ్వాల్సిందే అనడంతో మత సామరస్యాన్నే కించపరుస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యం కల్పించిన అవకాశాలతో జగన్ అత్యున్నత పదవులు పొంది, వాటిని అడ్డం పెట్టుకుని దేశ సంపదను కొల్లగొట్టారని ఆరోపించారు. ఇక్కడి సంప్రదాయాలను కించపరిచుస్తూ.. భారతదేశంలో మాత్రం జగన్ ఎందుకుండాలని మంత్రి గొట్టిపాటి రవి ప్రశ్నించారు.

## మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లుపై జస్టిస్ పీసీ ఘోష్ ఆగ్రహం

మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లుపై జస్టిస్ పీసీ ఘోష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీకెంట్ ఫైల్స్ విషయంలో వెంకటేశ్వర్లు చెప్పిన సమాధానంపై మండిపడ్డారు.

హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 28: మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లుపై జస్టిస్ పీసీ ఘోష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీకెంట్ ఫైల్స్పై వెంకటేశ్వర్లు చెప్పిన సమాధానంపై మండిపడ్డారు. తన వద్ద ప్లాన్స్, డిజైన్స్ ఉన్నాయని... కమిషన్కు తప్పుడు సమాచారం ఇస్తారా? అని జస్టిస్ ఘోష్ ప్రశ్నించారు. గతంలో కాళేశ్వరం ఈఎన్సీగా పని చేసిన వెంకటేశ్వర్లు శనివారం కమిషన్ ఎదుట విచారణకు హాజరయ్యారు. వివిధ అంశాలకు సంబంధించి ఆయను కమిషన్ ప్రశ్నించింది. ప్రత్యేకంగా మేడిగడ్డ ఆనకట్టకు సీకెంట్ ఫైల్స్ వినియోగించమని ఎవరు సూచించారని కమిషన్ ఛైర్మన్ ప్రశ్నించగా.. సీడీవో సీఈ సూచనల మేరకు ఇలా చేశానని సమాధానమిచ్చారు. దీనిపై కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కమిషన్ ను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయవద్దని ఘాటుగా జస్టిస్ ఘోష్ వ్యాఖ్యానించారు. అయితే, తన సమాధానాన్ని సరిచూసుకునే అవకాశం ఇవ్వాలని వెంకటేశ్వర్లు కోరగా.. దీనికి అంగీకరించబోనని తేల్చి చెప్పారు. తగిన దస్త్రాలు సమర్పిస్తే సవరించుకునే అవకాశం ఇస్తామని అన్నారు. తనకు ఆంగ్లంపై పూర్తిగా పట్టు లేదని వెంకటేశ్వర్లు తెలపగా.. ఆంగ్లంపై పట్టు లేకుండానే కాళేశ్వరం సీఈగా ఎలా పని చేశారని కమిషన్ అసహనం వ్యక్తం చేసింది.



## వైకాపా అసత్య ప్రచారాల పట్ల అప్రమత్తంగా ఉండాలి :సీఎం చంద్రబాబు

వైకాపా వేగంగా వ్యాప్తి చేయాలనుకుంటున్న అసత్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఎం, తెదేపా అధినేత చంద్రబాబు తెలిపారు.



అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 28: వైకాపా వేగంగా వ్యాప్తి చేయాలనుకుంటున్న అసత్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఎం, తెదేపా అధినేత చంద్రబాబు తెలిపారు. ఎన్టీఆర్ భవన్లో పార్టీ నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. మనం ప్రజలకు నిజం చెప్పే లోపు జగన్ అబద్ధాలను ప్రచారం చేయాలని చూస్తున్నారన్నారు. ప్రభుత్వం-పార్టీ సమన్వయంతో కుట్రలను సమర్థంగా తిప్పికొట్టాలని చెప్పారు. అనంతపురం జిల్లాలో రాములవారి రథానికి నిప్పుపెట్టిన ఘటనలో పోలీసుల తీరుపై సీఎం వద్ద నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. నిందితులు వైకాపా నేతలంటూనే రాజకీయ ప్రమేయం లేదని భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయడాన్ని నేతలు ప్రస్తావించారు. విచారణ పూర్తి చేయకుండా రాజకీయ ప్రమేయం లేదనడం సరికాదనే అభిప్రాయం వ్యక్తం చేశారు. కొందరు పోలీసులు అత్యుత్సాహంతో ప్రకటనలు ఇవ్వకుండా చూడాలని నేతలు కోరారు.

## నేడు తిరుమలలో పర్యటించనున్న సిట్


లడ్డూ వివాదంపై ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం ఇవాళ మధ్యాహ్నం తిరుమలలో పర్యటించనుంది.

తిరుమల, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 28: లడ్డూ వివాదంపై ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం ఇవాళ మధ్యాహ్నం తిరుమలలో పర్యటించనుంది. సిట్ అధిపతి సర్వశ్రేష్ఠ త్రిపాఠి నేతృత్వంలో బృంద సభ్యులు తిరుమలలో పర్యటించనున్నారు. తితిదే ఈవో శ్యామలరావుతో సిట్ అధికారులు సమావేశం కానున్నారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో విచారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం సిట్ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. సిట్ కోసం తితిదే ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేయనుంది.



## 200 గ్రాముల బంగారంతో చీర ... ధర ఎంత అంటే ?

రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్లకు చెందిన ఓ చేనేత కళాకారుడు అద్భుత కళాకృతిని ఆవిష్కరించారు. 200 గ్రాముల పసిడితో బంగారు చీర తయారు చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు.



సిరిసిల్ల, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 28: రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్లకు చెందిన ఓ చేనేత కళాకారుడు అద్భుత కళాకృతిని ఆవిష్కరించారు. 200 గ్రాముల పసిడితో బంగారు చీర తయారు చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. సిరిసిల్ల పట్టణానికి చెందిన చేనేత కళాకారుడు నల్ల విజయ్ కుమార్ మరో అరుదైన రికార్డు సృష్టించారు. హైదరాబాద్కు చెందిన ఓ వ్యాపారవేత్త 200 గ్రాముల బంగారంతో చీర తయారు చేయాలని కోరారు. ఈ చీరను తయారు చేయడానికి ఆరు నెలల క్రితమే ఆర్డర్ తీసుకున్నట్లు విజయ్ తెలిపారు. బంగారాన్ని జరి తీయడానికి కొత్త డిజైన్ తయారు చేయడానికి 10 నుంచి 12 రోజులు పట్టింది. ఈ చీర 49 ఇంచుల వెడల్పు, ఐదున్నర మీటర్ల పొడవు, బరువు 800 నుంచి 900 గ్రాములు ఉంటుందన్నారు. ఆ వ్యాపారవేత్త వచ్చే నెల 17న జరిగే తన కుమార్తె వివాహానికి ఈ చీరను తయారు చేయిస్తున్నట్లు చెప్పారు. ఈ చీరను రూ.18 లక్షల వ్యయంతో తయారు చేసినట్లు విజయ్‌కుమార్ తెలిపారు. బంగారంతో చీర తయారు చేయడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు.

## పేదల కన్నీళ్లపై అభివృద్ధి చేయడం ఏంటి? :హరీశ్ రావు

తమ ఎమ్మెల్యేల బృందంతో హైడ్రా బాధితుల ఇళ్లను సందర్శిస్తామని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్ రావు తెలిపారు.

హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 28: తమ ఎమ్మెల్యేల బృందంతో హైడ్రా బాధితుల ఇళ్లను సందర్శిస్తామని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణ భవన్లో హైడ్రా బాధితులతో ఆయన సమావేశమై మాట్లాడారు. భారాస లీగల్ సెల్ నుంచి వారికి సాయం అందిస్తామన్నారు. ప్రభుత్వానికి పేదల ఆశీర్వాదాలు ఉండాలి కానీ.. వారి గోసలు కాదని చెప్పారు. "హైదరాబాద్ ఖ్యాతిని రేవంత్‌రెడ్డి దెబ్బతీస్తున్నారు. మీ సోదరుడికి నోటీసులు ఇచ్చి.. పేదల ఇంటికి మాత్రం బుల్డోజర్లా? అఖిలపక్ష సమావేశం నిర్వహించి మూసీపై ముందుకెళ్లాలి. పేదల కన్నీళ్లపై అభివృద్ధి చేయడం ఏంటి?" అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

### బుల్డోజర్ల కంటే ముందు మేం వస్తాం: సబితా ఇంద్రారెడ్డి

భారాస ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. తామంతా హైడ్రా బాధితులకు అండగా ఉంటామన్నారు. కొడంగల్లోలో రేవంత్‌రెడ్డి ఇల్లు చెరువులో ఉందని విమర్శించారు. బాధితుల వద్దకు బుల్డోజర్లు వస్తే వాటికంటే ముందు తాము వస్తామని చెప్పారు.



# హిందీలో "దేవర" పెరుగుతున్న "దేవర" వసూళ్లు

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్ గా దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్ లో చేసిన అవైటెడ్ చిత్రమే "దేవర". మరి మాస్ లో భారీ అంచనాలు సెట్ చేసుకున్న ఈ చిత్రం కోసం అభిమానులు ఎన్నో అంచనాలు సెట్ చేసుకొని రిలీజ్ కోసం ఎదురు చూస్తూ వచ్చారు. అలా పాన్ ఇండియా భాషల్లో రిలీజ్ కి వచ్చిన ఈ చిత్రం రికార్డు ఓపెనింగ్స్ ని అందుకుంది. దీనితో ఎన్టీఆర్ కెరీర్ లోనే కాకుండా ఇండియన్ సినిమా దగ్గర కూడా భారీ ఓపెనింగ్స్ సాధించిన సినిమాగా అయితే దేవర మరో రికార్డు సెట్ చేసింది. అయితే నార్త్ లో కూడా దేవర సాలిడ్ ఓపెనింగ్స్ ని అందుకున్నట్టుగా ట్రేడ్ వర్గాలు వారు తెలిపారు. కానీ ఇప్పుడు డే 2 కి దేవర మరింత గ్రోత్ ని అందుకున్నట్టుగా ఇప్పుడు తెలుస్తుంది. దీనితో రెండో రోజు మొదటి రోజు కంటే ఎక్కువ వసూళ్లు ఈ చిత్రం అందుకుంటుంది అని చెప్పొచ్చు. ఆల్రెడీ డే 1 8 కోట్ల మేర వసూళ్లు అందుకోగా మొదటి వీకెండ్ లో దేవర 30 కోట్లు నెట్ వసూళ్లు సాధించే అవకాశం ఉందని ట్రేడ్ పండితులు చెబుతున్నారు. మొత్తానికి అయితే నార్త్ మార్కెట్ లో కూడా ఎన్టీఆర్ సత్తా చాటుతున్నాడు అని చెప్పాలి.






# "గేమ్ ఛేంజర్" మాస్ సాంగ్ ప్రోమోకి టైం ఫిక్స్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా కియారా అద్వానీ హీరోయిన్ గా మావెరిక్ దర్శకుడు శంకర్ తెరకెక్కిస్తున్న అవైటెడ్ చిత్రం "గేమ్ ఛేంజర్" కోసం అందరికీ తెలిసిందే. ఇక ఈ చిత్రం నుంచి మేకర్స్ ఫుల్ స్వింగ్ లో వరుస అప్డేట్స్ ఇవ్వడం స్టార్ట్ చేయడంతో మెగా ఫ్యాన్స్ మరింత ఎగ్జైటింగ్ గా కనిపిస్తున్నారు. ఇక ఈ చిత్రం నుంచి ఆల్రెడీ సెకండ్ సింగిల్ ని అనౌన్స్ చేయగా దీనిని ఈ 30న రిలీజ్ చేస్తున్నట్టుగా తెలిపారు. అయితే నేడు దీని ప్రోమోని రిలీజ్ చేస్తున్నట్టుగా తెలిపిన సంగతి తెలిసిందే. అయితే ఈ ప్రోమోకి ఇప్పుడు టైం వచ్చేసింది. ఈ మాస్ సాంగ్ ప్రోమోని ఈరోజు సాయంత్రం 6 గంటల 3 నిమిషాలకి రిలీజ్ చేస్తున్నట్టుగా ప్రకటించేసారు. మరి ఈ సాంగ్ ప్రోమో విజువల్స్ ఎలా ఉంటాయో చూడాలి. ఇక ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తుండగా దిల్ రాజు నిర్మాణం వహిస్తున్నారు అలాగే ఈ డిసెంబర్ 20న సినిమా గ్రాండ్ గా రిలీజ్ కి రాబోతుంది.

# చిరు, బాలయ్యపై అదిరే ఫ్రేమ్



ప్రస్తుతం మన టాలీవుడ్ సీనియర్ హీరోస్ అంతా కూడా తమ భారీ చిత్రాల్లో బిజీగా ఉన్న సంగతి అందరికీ. మరి వారిలో మెగాస్టార్ చిరంజీవి అలాగే నందమూరి మాస్ గాడ్ నందమూరి బాలకృష్ణ కూడా ఒకరు. అయితే ఈ ఇద్దరూ కలిసిన సందర్భం అభిమానులకి ఎంతో స్పెషల్ గా మారుతాయి. అలా రీసెంట్ గా బాలయ్య 50 ఏళ్ల సినీ ప్రస్థాన వేడుకల్లో ఒకే స్టేజి పై బాలయ్య, చిరు కలిసిన మెగా మాస్ ఫ్రేమ్ కలిగించిన ఆనందం అంతా ఇంతా కాదు. మరి లేటెస్ట్ గా ఐఫా అవార్డ్స్ లో మరోసారి ఈ మెగా మాస్ ఫ్రేమ్ సాధ్యం అయ్యింది. ఈ వేడుకల్లో మెగాస్టార్ తో కలిసి బాలయ్య ఆప్యాయంగా ఆలింగనం చేసుకుంటున్న పిక్ ఒకటి ఫ్యాన్స్ లో వైరల్ గా మారింది. దీనితో ఇది చూసిన మెగా మరియు నందమూరి అభిమానులు మరింత ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక బాలయ్య తన కెరీర్ 109వ సినిమాతో ఫుల్ బిజీగా ఉండగా చిరు తన "విశ్వంభర" సినిమాతో బిజీగా ఉన్నారు. ఈ రెండు సినిమాలులో వచ్చే ఏడాది సంక్రాంతికి చిరు ఆల్రెడీ ఫిక్స్ కాగా బాలయ్య సినిమా కూడా దాదాపు ఖరారు అన్నట్టు తెలుస్తోంది.


# ఒక్క పాట కోసం రెండు మెగా మూవీస్ పెండింగ్..?

టాలీవుడ్‌లో తెరకెక్కుతున్న మెగా చిత్రాల్లో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' ప్రేక్షకుల్లో ఎలాంటి బజ్‌ని క్రియేట్ చేసిందో మనం చూశాం. ఈ సినిమాను దర్శకుడు వశిష్ఠ డైరెక్ట్ చేస్తుండగా పూర్తి సోషియో ఫాంటెసీ మూవీగా చిత్ర యూనిట్ తెరకెక్కిస్తోంది. ఈ సినిమా షూటింగ్‌కి ప్రస్తుతం బ్రేక్ ఇచ్చారు. మెగాస్టార్ చిరంజీవి చికన్‌గున్యతో బాధపడుతుండటంతో ఈ బ్రేక్ ఇచ్చారు. ఇక ఈ సినిమాలోని ఓ ఐటెం సాంగ్‌ను సెప్టెంబర్ నెలాఖరుకు చిత్రీకరించాలని చిత్ర యూనిట్ భావించింది. చిరంజీవి కోలుకుని సెట్స్‌కి రాగానే ఈ ఐటెం సాంగ్ చిత్రీకరణ జరుపుతారని తెలుస్తోంది. అటు ఐకానిక్ స్టార్ అల్లు అర్జున్ నటిస్తున్న ప్రెస్టీజియస్ మూవీ 'పుష్ప-2' కూడా ఇప్పటికే చివరిదశ షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమాలోనూ ఓ ఐటెం సాంగ్ షూట్ బ్యాలెన్స్ ఉంది. ఈ పాటలో డ్యాన్స్ చేయడానికి శ్రీలీల, త్రిప్తి దిమ్రిల పేర్లను మేకర్స్ పరిశీలిస్తున్నారట. ఈ పాట షూట్‌ను అక్టోబర్ చివరినాటికి పూర్తి చేయాలని సుకుమార్ అండ్ టీమ్ నిర్ణయించుకున్నారట. దీంతో ఒక్క ఐటెం సాంగ్ కోసం ఈ రెండు మెగా చిత్రాలు కూడా పెండింగ్‌లో పడటంతో ప్రస్తుతం అభిమానుల్లో ఆసక్తి క్రియేట్ అయ్యింది.




రిపబ్లిక్ సినిమా CINEMA

## క్రేజీ ప్రాజెక్ట్ లో పవన్ నోట పాట!?



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మళ్ళీ చాలా కాలం తర్వాత షూటింగ్ లో పాల్గొంటున్న సంగతి తెలిసిందే. ఏపీలో జరిగిన ఎన్నికలకి ముందే కొన్ని నెలలు పవన్ షూటింగ్స్ అన్నీ ఆపేయగా మళ్ళీ చాలా నెలల తర్వాత ఈ సెప్టెంబర్ నుంచి తాను షూటింగ్‌లో పాల్గొన్నారు. ప్రస్తుతం రెండు సినిమాలు ఓజి, హరిహర వీరమల్లు షూటింగ్స్ ని తాను లైన్ లో పెట్టుకోగా అల్రెడీటీ వీరమల్లు షూటింగ్ లో తాను పాల్గొనడం కూడా జరుగుతుంది. అయితే ఈ సినిమాకి సంబంధించే క్రేజీ టాక్ ఇప్పుడు వినిపిస్తుంది. ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాలో పవన్ సాలిడ్ యాక్షన్ తో పాటుగా పాట కూడా పాడబోతునట్టుగా ఇప్పుడు తెలుస్తుంది. సినిమాలో ఒక ఇంట్రెస్టింగ్ సందర్భంలో అయితే పవన్ చేత పాట పాడించడానికి స్కోప్ ఉందట. దీనితో ఆ సాంగ్ ని ఇపుడు కీరవాణి పవన్ తోనే పాడించాలని డిసైడ్ అయినట్టుగా తెలుస్తుంది. దీనితో మళ్ళీ చాలా కాలం తర్వాత పవన్ నోట మరో పాట రాబోతుంది అని చెప్పాలి. ఇక ఈ చిత్రాన్ని జ్యోతి కృష్ణ దర్శకత్వం వహిస్తుండగా ఏ ఎం రత్నం భారీ బడ్జెట్ తో నిర్మాణం వహిస్తున్నారు.

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- ప్రపంచ రేబీస్ దినోత్సవం
- 0551 సా.పూ: కన్ఫ్యూషియస్ మత స్థాపకుడు కన్ఫ్యూషియస్ జననం (మ.0479 క్రీ.పూ.).
- 1745: బ్రిటన్ జాతీయ గీతం 'గాడ్ సేవ్ ది కింగ్' మొదటిసారిగా పాడిన రోజు.
- 1895: ఫ్రెంచి జీవ శాస్త్రవేత్త లూయీ పాశ్చర్ మరణం (జ.1822).
- 1895: ఆధునిక తెలుగు కవి జాషువా జననం (మ.1971).
- 1907: భారత స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ భగత్ సింగ్ జననం (మ.1931).
- 1909: భారతీయ సినిమా నటుడు, నిర్మాత పైడి జైరాజ్ జననం (మ.2000).
- 1929: హిందీ సినిమారంగ నేపథ్యగాయని, నటి లతా మంగేష్కర్ జననం (మ.2022). (చిత్రంలో)
- 1982: వ్యక్తిగత ఒలింపిక్ బంగారు పతకాన్ని గెలుచుకున్న ఇద్దరు భారతీయులలో మొదటివాడైన అభినవ్ బింద్రా జననం.




రేబీస్ దినోత్సవం


కన్ఫ్యూషియస్



బ్రిటన్ జాతీయ గీతం


లూయీ పాశ్చర్


తెలుగు కవి జాషువా


సర్దార్ భగత్ సింగ్


పైడి జైరాజ్


లతా మంగేష్కర్


అభినవ్ బింద్రా

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

# టీ20 క్రికెట్లో నికోలస్ పూరన్ ప్రపంచ రికార్డు

టీ20 క్రికెట్లో వెస్టిండీస్ హిట్టర్ నికోలస్ పూరన్ ప్రపంచ రికార్డు నెలకొల్పాడు.




వెస్టిండీస్ పవర్ హిట్టర్ నికోలస్ పూరన్ ఈ ఏడాది పరుగుల వరద పారిస్తున్నాడు. ప్రస్తుతం కరేబియన్ ప్రీమియర్ లీగ్ 2024 (సిపిఎల్)లో ట్రిన్బాగో నైట్ రైడర్స్ తరపున ఆడుతున్న పూరన్.. టీ20 క్రికెట్లో సరికొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ఒక క్యాలెండర్ ఇయర్ లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. శుక్రవారం బార్బడోస్ రాయల్స్ తో జరిగిన మ్యాచ్లో పూరన్ 15 బంతుల్లో 27 పరుగులు చేశాడు. ఈ క్రమంలోనే మహ్మద్ రిజ్వాన్ (2,036 పరుగులు.. 45 ఇన్నింగ్స్.. 2021) రికార్డును బ్రేక్ చేశాడు. నికోలస్ పూరన్ ఈ ఏడాది ఇప్పటివరకు 65 ఇన్నింగ్స్ ల్లో 2,059 పరుగులు చేశాడు. అతడు ఈ సంవత్సరంలో టీ20ల్లో వెస్టిండీస్, దర్బన్ సూపర్ జెయింట్స్, లఖ్నవ్వూ సూపర్ జెయింట్స్, ఎంఐ ఎమిరేట్స్, ఎంఐ న్యూయార్క్, నార్తర్న్ సూపర్ ఛార్జర్స్, రంగ్పూర్ రైడర్స్, ట్రిన్బాగో నైట్ రైడర్స్ జట్లకు ప్రాతినిధ్యం వహించి 14 అర్ధ సెంచరీలు సాధించాడు. రెండుసార్లు 90కిపైగా పరుగులు చేశాడు.


## టీ20 క్రికెట్లో ఎక్కువ రన్స్ చేసిన ఆటగాళ్లు..

- నికోలస్ పూరన్- 2,059 పరుగులు.. 65 ఇన్నింగ్స్ (2024)
- మహ్మద్ రిజ్వాన్ - 2,036 పరుగులు.. 45 ఇన్నింగ్స్ (2021)
- అలెక్స్ హేల్స్- 1,946 పరుగులు.. 61 ఇన్నింగ్స్ (2022)
- జోస్ బట్లర్ - 1,833 పరుగులు.. 55 ఇన్నింగ్స్ (2023)
- మహ్మద్ రిజ్వాన్ - 1,817 పరుగులు.. 44 ఇన్నింగ్స్ (2022)

## ఫిట్‌నెస్

# ఈ ఆసనాలతో మలబద్ధక సమస్య మాయం

మలబద్ధకం సమస్య ఉంటే శరీరంలో చాలా సమస్యలు వస్తాయి. దీనికి యోగాలో కొన్ని పరిష్కారాలు ఉన్నాయి. యోగా చేయడం వల్ల మలబద్ధకం, అతిసారం, జీర్ణసమస్యలు తగ్గుతాయని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. యోగాలో కొన్ని ఆసనాలు జీర్ణవ్యవస్థని ఆరోగ్యంగా చేస్తాయి. దీని వల్ల జీర్ణాశయం మెరుగై మలబద్ధకం, గ్యాస్ సమస్యల నుంచి రిలీఫ్ అవ్వొచ్చు. అలాంటి కొన్ని ఆసనాల గురించి తెలుసుకోండి.





### పవన ముక్తాసన..

ఈ ఆసనం చేయడం వల్ల మలబద్ధకం, గ్యాస్ సమస్య తగ్గిస్తుంది.

ఎలా చేయాలంటే ..

వెల్లకిలా పడుకోండి.
మోకాళ్ళని ఛాతీవైపుకి లాగి వెనక్కి పడుకోండి.
చేతులతో మోకాళ్ళని పట్టుకోండి.
గడ్డాన్ని లోపలికి తీసుకురండి.
మోకాళ్ళని ఛాతీవైపు తీసుకురండి.
ఇలానే కొన్నిసార్లు బ్రీథింగ్ తీసుకోండి.



### లెగ్స్ వాల్ అప్..

ఈ ఆసనం చేసేటప్పుడు బాడీ కొద్దిగా రివర్స్‌లో ఉంటుంది.

ఎలా చేయాలంటే..

గోడని చూస్తూ కూర్చోండి. తర్వాత వెనుక భాగాన్ని నేలపైకి దించి గోడకి వీలైనంత దగ్గరగా తుంటితో కాళ్ళతో గోడపైకి నడవండి. అవసరమైతే సపోర్ట్ కోసం టవల్, దుప్పటిని మడిచి వాడండి. తల నేలపై ఆచ్చండి. ఉండగలిగినంత సేపు ఇదే స్థితిలో ఉండండి.




### భుజంగాసనం..

ఈ ఆసనం చేయడం వల్ల గ్యాస్, పొత్తికడుపు ఉబ్బరం వంటి సమస్యలు తగ్గుతాయి.

ఈ ఆసనం ఎలా చేయాలంటే..

బోర్లా పడుకోండి. అరచేతులని భుజాల క్రింద పెట్టండి. చేతులని వంచండి. కడుపు కండరాలని కాళ్ళని స్టిఫ్‌గా పెట్టండి. అరచేతులతో నేలని నొక్కుతూ భుజాలు, పైభాగాన్ని పైకి ఎత్తండి. ఇలానే గాలిని పీలుస్తూ వదలండి. తిరిగి నేలపైకి రండి.



### సైనస్..సుప్త మత్స్యేంద్రాసన..

ఎలా చేయాలంటే...

ముందుగా వెల్లకిలా పడుకోవాలి. ఇప్పుడు భుజాలని సైడ్‌కి పెట్టి అరచేతుల్ని కిందకి పెట్టాలి. కుడి మోకాలిని వంచాలి. ఆ కాలిని మరో కాలి నుంచి పక్కకి తీసుకురండి. ఫొటోలో చూపినట్లుగా ఉంచండి. కాసేపు ఇదే భంగిమలో బ్రీథ్ తీసుకుంటూ ఉండండి. తర్వాత రిపీట్ చేయండి.



గమనిక: ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఇవి పాటించడం వల్ల ఫలితాలు అనేవి వ్యక్తిగతం మాత్రమే. వీటిని పాటించే ముందు డైటీషియన్‌ని సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.

### అర్ధమత్స్యేంద్ర..

దీనినే ఇంగ్లీష్‌లో హాఫ్ స్పైనల్ ట్విస్ట్ అంటారు.

ఎలా చేయాలంటే..

ముందుగా కాళ్ళు చాపి కూర్చోవాలి.
కుడి కాలు పాదాన్ని పట్టుకుని ఎడమ కాలుపైనుంచి తీసుకొచ్చి మోకాలు దగ్గర ఉంచాలి.
ఫొటోలో చూపినట్టుగా ఉండండి.
తర్వాత ఎడమ కాలిని జరుపుతూ బ్యాక్ వరకూ తీసుకురావాలి.
ఇప్పుడు ఎడమ మోచితిని కుడి మోకాలి నుంచి ట్విస్ట్ చేసి ముఖాన్ని కుడి భుజం వైపు తిప్పాలి.
ఇదే ఆసనంలో కాసేపు ఉండి. తర్వాత మరోవైపు చేయాలి.

